సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 12 । మే । 2024



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 640 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



పెనుకొండ.. జగనన్నే అండ

పెనుకొండ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ దృష్టి సారించారు. మెడికల్ కళాశాల, ఆస్పత్రి మంజూరు చేశారు. నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
39.6°/23.1°

జిల్లావ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

ఓటు నీదే..భవితా నీదే

- వజ్రాయుధాన్ని జాగ్రత్తగా సంధించాలి..
- 'గతాన్ని' గుర్తుంచుకుని..వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలి
- 'మరింత మంచి' కోసం, బంగారు భవిత కోసం మద్దతు పలకాలి
- 'విశ్వసనీయత' కల్గిన నేతకు పట్టం కట్టాలి
- అభ్యర్థుల గుణగణాలను దృష్టిలో ఉంచుకుని మరీ 'బటన్' నొక్కాలి

ఓటు వజ్రాయుధం. అత్యంత జాగ్రత్తగా సంధించాలి. 'గత' చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలి. వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలి. భవిష్యత్తునూ దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరు మేలు చేశారో, ఇక మీదటా చేస్తారో వారికే 'బటన్' నొక్కాలి. మనతో పాటు పిల్లల భవిష్యత్తును, 'పెద్దల' శ్రేయస్సునూ గమనంలో ఉంచుకోవాలి. మనందరి కోసం నిరంతరం తపించే నేతను ఎన్నుకోవాలి. గుణగణాలను గమనించి మరీ ఓటెత్తాలి. రేపటి మహా సంగ్రామం (పోలింగ్)లో మీరు సంధించే వజ్రాయుధం పేదలకు మేలు చేసేలా, పెత్తందారులు, వంచకులకు మరోసారి గుణపాఠం నేర్పేలా ఉండాలి. –సాక్షి, పుట్టపర్తి



హిందూపురం పార్లమెంట్ అభ్యర్థులు (అభ్యర్థుల గుణగణాలు)

జె.శాంత (వైఎస్సార్ సీపీ)



- కర్ణాటక రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకున్నారు
- ఎలాంటి కేసుల్లేవ్. దందాలు చేసే వ్యక్తిత్వం కాదు.
- హిందూపురం నియోజకవర్గంలోని అందరితో సత్సంబంధాలున్నాయి.
- ప్రజా సేవ చేయాలనే తపన ఉన్న మహిళా నాయకురాలు.
- సామాన్య వ్యక్తిగా వచ్చి.. ప్రజాదరణ పొందుతున్నారు.

బీకే పార్థసారథి (టీడీపీ)



- పెనుకొండ ఎమ్మెల్యేగా అక్రమాలు చేశారన్న ఆరోపణలున్నాయి.
- 'కియా' కార్ల కంపెనీలో భారీ వసూళ్లు చేసినట్లు జనం చర్చించుకుంటున్నారు.
- క్వారీల నిర్వహణకు డబ్బులు తీసుకుని అనుమతులు ఇప్పించేవారు.
- అనుచరులు అరాచకాలు చేసినా వారికి అండగా నిలిచి జనాన్ని ఇబ్బంది పెట్టారు.

ధర్మవరం అభ్యర్థులు

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (వైఎస్సార్ సీపీ)



- 'గుడ్‌మార్నింగ్' పేరుతో నిత్యం ప్రజల్లోనే ఉంటారు.
- మెసేజ్ పెట్టినా స్పందిస్తారు.
- కేతిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో అరాచకాల్లేవు.
- ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిపై విజన్ ఉన్న నేత.
- విదేశాల్లో ఉద్యోగం చేస్తూ చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చారు.

సత్యకుమార్ (బీజేపీ)



- నియోజకవర్గానికి పరిచయం లేని వ్యక్తి.
- ఆయన వ్యవహార శైలిపై బీజేపీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు.
- సొంతంగా ప్రచారం చేయలేక స్టార్ క్యాంపెయినర్లను బయటి నుంచి తెచ్చుకున్నారు.
- డబ్బులు ఎరగా వేసి ఓట్లు లాగాలని ప్రయత్నిస్తున్నాడు

పెనుకొండ అభ్యర్థులు

కేవీ ఉషశ్రీ (వైఎస్సార్ సీపీ)



- మంత్రిగా ప్రజాసేవలో పేరు పొందారు.
- కళ్యాణదుర్గంలో అభివృద్ధి చేశారనే మంచి పేరుంది.
- పెనుకొండ వాసులంతా ఆమెను స్వాగతిస్తున్నారు.
- ఎలాంటి కేసుల్లేవు. చదువుకున్న నాయకురాలు.
- అన్ని వర్గాలను కలుపుకుంటూ ముందుకెళ్తున్నారు.
- నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించారు.

ఎస్.సవిత (టీడీపీ)



- డీజిల్ దందా చేశారు. క్వారీల్లో వసూళ్లు.
- అవినీతి, అక్రమాల్లో ఎక్కువగా ఇరుక్కున్నారు.
- ఈమె భర్త రైల్వే కాంట్రాక్టర్. అక్కడ గోల్‌మాల్ చేశారు.
- గతంలో సీబీఐ అధికారులు కూడా వీరి ఇళ్లలో సోదాలు చేశారు.
- 'కియా' ఏర్పాటు సమయంలో భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలున్నాయి.

హిందూపురం అభ్యర్థులు

టీఎన్ దీపిక (వైఎస్సార్ సీపీ)



- విద్యావంతురాలైన మహిళ. ప్రజాసమస్యలపై స్పందిస్తున్నారు.
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంది.
- రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.
- సొంతడబ్బు వెచ్చించి పలు సమస్యలు పరిష్కరించారు.

నందమూరి బాలకృష్ణ (టీడీపీ)



- చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వస్తారు.
- అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిందేమీ లేదు.
- పీఏలను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తుంటారు.
- ప్రజలే దగ్గరకు వెళ్లినా చెంపదెబ్బలతో మర్యాద చేస్తారు.

కదిరి అభ్యర్థులు

బీఎస్ మక్బుల్ (వైఎస్సార్ సీపీ)



- సౌమ్యుడు, మృదుస్వభావి. రాజకీయాలకు కొత్త.
- నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు.
- అన్ని వర్గాల ప్రజలతో సఖ్యతగా మెలుగుతూ ముందుకెళ్తున్నారు.
- నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు.
- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకం ప్రజల్లో చూరగొన్నారు.

కందికుంట వెంకట ప్రసాద్ (టీడీపీ)



- కబ్జాలకు కేరాఫ్ అడ్రస్.
- పలు కేసుల్లో నిందితుడు. జైలుకూ వెళ్లివచ్చారు.
- అమాయకులను ఇబ్బందులు పెట్టి ఆస్తులు రాయించుకున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల భూములపై కన్నేశారు. ప్రజలను బెదిరించారు.
- తాను చెప్పినట్లు వినాలని అధికారులను బెదిరించిన దాఖలాలు ఉన్నాయి.

రాప్తాడు అభ్యర్థులు

తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ)



- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.
- సొంతంగా ట్రస్టు స్థాపించి ప్రజాసేవ చేశారు.
- రైతుల కోసం ఉచితంగా బోర్లు వేయించాడు.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్నారు.
- మహిళలకు స్వయం ఉపాధి కోసం అమ్మ డెయిరీ స్థాపించారు.

పరిటాల సునీత (టీడీపీ)



- అవినీతి, అక్రమాలకు, దౌర్జన్యాలకు చిరునామాగా నిలిచారు.
- మంత్రిగా కుటుంబ సభ్యుల ఎదుగుదలకు పని చేశారు.
- వెనుకబడిన వర్గాలను అణగదొక్కారు.
- పదవుల కోసం పాకులాడతారు.. ప్రజా సమస్యలను పట్టించుకోరు.
- నియోజకవర్గంలో అరాచక పాలన చేశారనే విమర్శలు ఉన్నాయి.

పుట్టపర్తి అభ్యర్థులు

దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ)



- చదువుకున్న వ్యక్తి. రాజకీయాలపై అనుభవం ఉంది.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం పరితపిస్తుంటారు.
- శ్రీసత్యసాయి జిల్లా సాధనకు కృషి చేశారు.
- రహదారులు, ప్రాజెక్టులు తేవడంలో సక్సెస్ అయ్యారు.
- ఇలాంటి నాయకుడు ఉండాలని ప్రజలే చర్చించుకుంటున్నారు.

పల్లె సింధూరారెడ్డి (టీడీపీ)



- రాజకీయాలపై అవగాహన లేదు.
- డబ్బులు పోసి టికెట్ తెచ్చుకున్నారు.
- నియోజకవర్గంపై పట్టు లేదు.
- ఆమె మామ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై తీవ్ర వ్యతిరేకత ఉంది.
- 'పల్లె' కుటుంబం అంటేనే కబ్జాలు, అక్రమార్జనకు అడ్రెస్‌గా పేరుంది.

మడకశిర అభ్యర్థులు

ఈరలక్కప్ప (వైఎస్సార్ సీపీ)



- సామాన్యుడు. ప్రజల్లోంచి వచ్చారు.
- పంచాయతీ సర్పంచ్‌గా ఉత్తమ సేవలందించారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాదరణ పొందారు.
- టికెట్ ప్రకటించిన నాటి నుంచి ప్రజల్లోనే ఉన్నారు.
- అన్ని వర్గాలను ప్రజలతో సఖ్యతగా మెలుగుతున్నారు.

ఎంఎస్ రాజు (టీడీపీ)



- నియోజకవర్గంపై అవగాహన లేదు.
- గతంలో అక్రమాలు, అరాచకాలు చేశారు.
- రాజు పేరు చెబితేనే జనం భయపడిపోతున్నారు.
- మడకశిర టీడీపీలోనే గ్రూపులు ఏర్పాటు చేశారు.
- ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడం కూడా తెలియదు.

న్యూస్‌రీల్

సబ్‌జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్



సబ్‌జైలు పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్, న్యాయమూర్తులు

కదిరి టౌన్: స్థానిక సబ్ జైలును శనివారం అనంతపురం జిల్లా న్యాయ సేవ ప్రాధికారి సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ సందర్శించారు. మౌలిక సదుపాయాలతో పాటు ఖైదీలకు అందుతున్న భోజనం ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి, న్యాయవాదులు నరసింహులు, జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

48 గంటల పాటు మద్యం షాపులు బంద్



పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న పోలింగ్ జరగనుండగా, జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ 48 గంటలు పాటు మూసివేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 11వ తేదీ (శనివారం) సాయంత్రం 7 గంటల నుంచి 13వ తేదీ (సోమవారం) సాయంత్రం 7 గంటల వరకు అంటే 48 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందన్నారు. జిల్లాలోని మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, ఎక్సైజ్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ పొందిన దుకాణాలు మూసి వేయాలన్నారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4వ తేదీ కూడా మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



ఎన్‌ఐసీ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

- అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు
- ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి
- ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు
- ప్రశాంత పోలింగ్‌కు భద్రత కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని 1,873 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అధికారులు విద్యుత్, బారికేడ్లు, తాగునీరు, షామియానాలు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో సిబ్బంది ద్వారా ఓటర్లకు స్లిప్పులు అందజేశారు.

కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ..

ఎన్నికల నిర్వణ కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి ఎన్నికల తీరును నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఎక్కడ ఏ సమస్య తలెత్తినా క్షణాల్లో చేరుకునే విధంగా పోలీస్ సిబ్బందిని నియమించారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ నుంచి పోలింగ్‌ను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే 99 శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తయ్యిందన్నారు. తక్కిన వారికి పోలింగ్ రోజున పంపిణీ చేసేందుకు బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

16,56,774 మంది ఓటర్లు..

జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో 16,56,774 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. 1,873 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆదివారం ఎన్నికల సామగ్రి తరలిస్తామన్నారు. శనివారం సాయంత్రంలో బహిరంగ ప్రచారం ముగిసిందని, ఇంటింటి ప్రచారం చేసుకోవడానికి ఐదుగురికి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థికి, ఎలక్షన్ ఏజెంట్‌కు మాత్రమే పోలింగ్ ఏజెంట్లను నియమించే అవకాశం ఉందన్నారు. శనివారం సాయంత్రం నుంచే జిల్లాలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రశాంతంగా పూర్తి చేయడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అనుకోని సంఘటన జరిగితే 5 నిమిషాల్లో చేరుకునే విధంగా ర్యాపిడ్ యాక్షన్ బృందాలను సిద్ధం చేశామన్నారు.

ప్రచారం పరిసమాప్తం

- శనివారం సాయంత్రంతో మైకుల బంద్
- 24 రోజుల పాటు ఊరూవాడా హోరెత్తించిన రాజకీయ పార్టీలు
- హిందూపురం పార్లమెంటు బరిలో 13 మంది
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 91 మంది
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 16.48 లక్షల మంది

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార పర్వం ముగిసింది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, ఆ రోజు నుంచే వివిధ పార్టీ అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. 24 రోజుల పాటు ఊరూరా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యకర్తల్లో ఉత్తేజం నింపుతూ..తాము చేసిన అభివృద్ధి గురించి ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు అందరూ బహిరంగ ప్రచారం బంద్ చేశారు.

కుటుంబ సభ్యుల ప్రచారం..

ప్రచారంలో భాగంగా అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులూ పాల్గొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ బంధువులు, కుటుంబ సభ్యులు అభ్యర్థుల తరపున ప్రచారం చేసి ఓటు అభ్యర్థించారు. ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర.. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఆయా పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు ప్రజల్లో తిరిగారు. శనివారం సాయంత్రంతో బహిరంగ ప్రచారం ముగియడంతో ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు.

హోరెత్తించిన రోడ్డు షోలు..

ఎన్నికల హడావుడి కేవలం వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యనే కనిపించింది. ఇరు పార్టీల అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో భారీ రోడ్డు షోలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎవరికి వారుగా బల ప్రదర్శన కోసం తలపడ్డారు. భారీ జనసమీకరణ చేసేందుకు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. సాయంత్రం వేళల్లో భారీ జనసందోహం మధ్య రోడ్డు షోలతో అలరించారు.

వైఎస్సార్‌సీపీ దూకుడు..

ప్రచారంలో ప్రతిపక్ష టీడీపీ కంటే అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దూకుడు ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలే స్టార్ క్యాంపెయినర్లుగా మారడం విశేషం. బస్సు యాత్రలో భాగంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధర్మవరం, కదిరిలో పర్యటించడం.. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో హిందూపురంలో బహిరంగ సభలో పాల్గొనడంతో ఆ పార్టీకి మరింత ఊపొచ్చింది.

అసెంబ్లీ స్థానాల బరిలో 91 మంది..

జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,48,268 మంది ఓటర్లు ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసిన తర్వాత హిందూపురం పార్లమెంటు స్థానం బరిలో 13 మంది, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 91 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.

అభివృద్ధి కావాలా.. అరాచకాలు కావాలా?

- ఆలోచించి ఓటు వేయండి
- ధర్మవరం వాసులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపు
- ఎలక్షన్‌ను కలెక్షన్లుగా మార్చిన మాయల మరాఠి సత్యకుమార్
- వచ్చిన డబ్బుతో ప్రలోభాలకు గురి చేస్తూ నీచ రాజకీయం
- కేతిరెడ్డి కావాలో నాన్‌లోకల్ వ్యక్తి కావాలో ప్రజలంతా ఆలోచించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ''అభివృద్ధి కావాలా... అరాచకాలు కావాలా.. మీ ఓటుతో మీరే తేల్చుకోండి. బాగా ఆలోచించి మంచికి మద్దతు పలకండి. ఐదేళ్ల భవిష్యత్ తలచుకొని ఈవీఎంలో బటన్ నొక్కండి'' అని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎలక్షన్‌లను కలెక్షన్లుగా మార్చి ఇతర రాష్ట్రాల్లో ఉన్న పారిశ్రామిక వేత్తలు, పట్టు వ్యాపారులతో రూ.కోట్లు వసూలు చేస్తున్న మాయల మరాఠి సత్యకుమార్ అని అన్నారు. అవినీతి సొమ్ముతో చేస్తున్న నీచ రాజకీయాలు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 30 దాకా యూట్యూబ్ ఛానళ్లను కొని ధర్మవరంలో ఏదో జరిగిపోతోందంటూ హంబక్ ప్రచారం చేశారన్నారు. అయినా ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులకు డబ్బులు ఎరవేసి కొనుగోలు చేశారన్నారు. వారి నిజస్వరూపం తెలిసి పార్టీలోకి వెళ్లిన వారు మళ్లీ వెనక్కి వచ్చి గగ్గోలు పెడుతున్నారన్నారు. సత్యకుమార్ తొలుత బీసీ కార్డుతో జనాల్లోకి వెళ్లాలని చూశారని, ప్రజలకు అతను బీసీ కాదన్న విషయం తెలియడంతో సినీ నటులతో ప్రచారం చేయించుకున్నారన్నారు. అయినా స్పందన లేక పోవడంతో కేంద్ర మంత్రులు, హోంమంత్రి అమిత్‌షాను రంగంలోకి దింపారన్నారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు. సత్యకుమార్ ఫ్యాక్షనిస్ట్ కంటే క్రూరమైన మనస్తత్వం కల్గిన వాడన్నారు. ఢిల్లీలో పలుకుబడి ఉందని గప్పాలు కొట్టే ఆయన... కేంద్ర నిధులతో తన పుట్టిన ఊరు ప్రొద్దుటూరును ఎందుకు అభివృద్ధి చేయలేక పోయారని ప్రశ్నించారు.

ఆలోచించి ఓటేయండి..

26 ఏళ్లకే ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి తనవంతుగా ధర్మవరం అభివృద్ధికి కృషి చేశానన్నారు. శాశ్వత మంచినీటి పథకాన్ని ప్రారంభించి తాగునీటి సమస్యలేకుండా చేశానన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని 24 వేల మందికి ఇంటిపట్టాలు ఇవ్వడంతో పాటు పేదల సొంతింటి కల సాకారం చేశానన్నారు. ప్రతి 30 వేల జనాభాకు ఒక అర్బన్‌హెల్త్ సెంటర్, రెండు నియోజకవర్గాల ప్రజలకు సేవలందించే మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ధర్మవరంలో ఏర్పాటయ్యేలా చూశానన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో కాయగూరల మార్కెట్‌ను నిర్మించామన్నారు. ఈ ఐదేళ్లలో నవరత్నాల పథకాలతో 94 శాతం మంది పేద ప్రజలకు రూ.3,200 కోట్ల నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.5 వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ నిత్యం పరితపించే కేతిరెడ్డి కావాలో ....నాన్‌లోకల్ వ్యక్తి, అరాచకవాది సత్యకుమార్ కావాలో విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలన్నారు. ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

క్లుప్తంగా

స్కూటీ దగ్ధం



మంటలు ఆర్పి వాహనాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

లేపాక్షి: స్థానిక బస్టాండ్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఓ స్కూటీ దగ్ధమైంది. ఎండల తీవ్రత కారణంగా షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగాయి. వెంటనే వాహనదారుడు అప్రమత్తమై స్కూటీని రోడ్డు పక్కన నిలిపి స్థానికుల సాయంతో ఇసుక చల్లి మంటలను అదుపు చేశాడు.

వ్యక్తి దుర్మరణం



రఫీ (ఫైల్)

ముదిగుబ్బ: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు..... ముదిగుబ్బ మండలం పెద్దచిగుళ్లరేవు గ్రామానికి చెందిన రఫీ (40) జొన్నలకొత్తపల్లి గ్రామం వద్ద చికెన్ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ద్విచక్ర వాహనంపై జొన్నలకొత్తపల్లి నుంచి వెళుతుండగా రాళ్లఅనంతపురం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, రఫీకి భార్య హసీనా, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఓటు వేసేందుకు వస్తూ.. మృతి



మృతుడు నరసింహమూర్తి

సోమందేపల్లి: ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు బెంగళూరు నుంచి బయలుదేరిన ఓ వృద్ధుడు మార్గమధ్యంలో బస్సులోనే మృతి చెందాడు. వివరాలు.. సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామానికి చెందిన నరసింహమూర్తి (52), లక్ష్మీదేవమ్మ దంపతులు పనుల కోసం బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 13న ఓటు హక్కు వినియోగించుకునేందుకు శనివారం ఉదయం భార్య, కుమారుడు నగేష్‌తో కలసి బెంగళూరు నుంచి బస్సులో బయలుదేరాడు. హిందూపురం సమీపంలోకి చేరుకుంటుండగా గుండెపోటుకు గురై బస్సులోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హిందూపురం బస్టాండ్‌కు చేరుకుని నరసింహమూర్తి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.



మడకశిర నియోజకవర్గం చందకచెర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు



ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లిలో ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ధర్మవరంలో మహిళలతో కలసి ర్యాలీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ



రామగిరి మండలం పేరూరు రోడ్డుషోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

హోరెత్తిన ప్రచారం

ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. అభ్యర్థులందరూ ఆయా నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఎటు చూసినా జనాభిమానం పోటెత్తింది. గత 40 రోజులుగా భగభగమంటున్న సూరీడు సైతం జన ఉప్పెన చూసి కాస్త నెమ్మదించాడు. రోడ్‌షోలు ప్రజల్లో ఫుల్ జోష్ నింపాయి. ఐదేళ్ల పాలనలో నిజమైన సంక్షేమాన్ని, అభివృద్ధిని చూశారని... మంచి చేసిన నాయకుడికే ఓటు వేయాలంటూ ఓ వైపు అభ్యర్థులు కోరుతూ ముందుకు సాగగా... మరో వైపు ప్రత్యర్థులు ఎందరున్నా.. మేమంతా సిద్ధమంటూ జిల్లా ప్రజలూ నినదించారు.

– సాక్షి బృందం:



కదిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహమ్మద్‌ను భుజాలపై ఎత్తుకుని ఊరేగిస్తున్న దృశ్యం. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా



గుడిబండ మండలం రాళ్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నేతలు



పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లిలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేవీ ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మ తరఫున ప్రచారం నిర్వహిస్తున్న స్థానికులు

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్



కదిరి: 'దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో సంక్షేమ పాలన కొనసాగుతోంది. ఈ పాలన ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి కావాలి' అని కదిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహమ్మద్ అన్నారు. ముఖ్యంగా పేదల కోసం మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఏర్పాటు కావాలన్నారు. శనివారం ఆయన 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సాక్షి: రాజకీయాలకు మీరు కొత్త కదా? మరి ఎలా చేస్తారు?

మక్బూల్: నాకు రాజకీయాలు కొత్త కాదు. 2004 నుంచే కదిరి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చాను. ఆ తర్వాత 2014లో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి అత్తార్ చాంద్‌బాషా గెలుపు కోసం కృషి చేశాను. ఇప్పుడు సీఎం వైఎస్ జగనన్న ఆశీస్సులతో బరిలోకి దిగాను. ఇందుకు పార్టీ అధినేత జగనన్నకు, మా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

సాక్షి: మీ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి?

మక్బూల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి బాగా వెనుకబడిన ప్రాంతం. ఓ వైపు చిత్తూరు, మరో వైపు వైఎస్సార్ జిల్లాలతో పాటు ఇంకో వైపు కర్ణాటక ప్రాంతం ఉన్నాయి. అన్ని ప్రాంతాల సంస్కృతులు ఇక్కడ చూడవచ్చు. ఇక్కడి ప్రజలు చాలా తెలివైన వారు. ఎవరు తమకు మంచి చేస్తారో... ఎవరికి ఓటు వేయాలో వారికి బాగా తెలుసు. ఈ సారి కూడా ఇక్కడ ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టబోతున్నాం.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి మీ ప్లాన్ ఏంటి?

మక్బూల్: కదిరిని జిల్లాలోనే ఓ రోల్‌మోడల్‌గా తీర్చి దిద్దాలనేది నా కోరిక. ఈ ప్రాంతంలోని యువతతో పాటు మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గార్మెంట్ పరిశ్రమలు తీసుకురావాలి. వేరుశనగ ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటు చేయాలి. ఇక్కడి వేరుశనగ పరిశోధనా కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలతో పాటు ఓ యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అన్ని గ్రామాలకూ మంచినీటి సౌకర్యంతో పాటు రోడ్డు వసతి కల్పిస్తాను.

సాక్షి: మీరు నాన్ లోకల్ అని మీ ప్రత్యర్థులంటున్నారు. దీనికి మీ సమాధానం?

మక్బూల్: నన్ను నాన్ లోకల్ అని అంటున్న టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌ది వాస్తవానికి ఈ ఊరు కాదు. వాళ్ల నాన్న రఘురామప్ప ఉద్యోగ రీత్యా కదిరికి వచ్చారంతే. నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఇక్కడే చదివాను. నాకు ఇక్కడ సొంతిల్లు కూడా ఉంది. నా కూతురును కూడా కదిరి వాసికే ఇచ్చి పెళ్లి చేశా. బెంగుళూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో బిజినెస్‌లు ఉన్నంత మాత్రాన నన్ను నాన్ లోకల్ అంటే ఎలా? నేను పక్కా లోకల్.

సాక్షి: ముస్లింల రిజర్వేషన్ల అంశంపై బీజేపీ తన వైఖరి ఏమిటో చెప్పింది. దీనిపై మీ స్టాండ్ ఏంటి?

మక్బూల్: దీనిపై మా అధినేత వైఎస్ జగన్ కూడా పూర్తి క్లారిటీ ఇచ్చారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమా అని ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ వచ్చింది. దానిని జగనన్న పక్కాగా అమలు చేస్తున్నారు. ఇక రిజర్వేషన్ రద్దు అంశంపై క్లారిటీ ఇచ్చిన బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకుని ముస్లింల ద్రోహిగా మారారు. రిజర్వేషన్ రద్దును ముస్లింలు ఎవరూ అంగీకరించడం లేదు. దీంతో టీడీపీ ఓటమి దాదాపు ఖాయమైందనే చెప్పవచ్చు.

బంగారు వ్యాపారి ఇంట చోరీ

గోరంట్ల: స్థానిక మెయిన్‌రోడ్డులో బంగారం దుకాణం నిర్వహిస్తున్న కేశవాచారి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బీరువాలోని 290 గ్రాముల బంగారంతో పాటు రూ.4.10 లక్షల నగదు అపహరించుకెళ్లారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నివాసం ఉంటున్న కేశవాచారి శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బంధువుల ఇంట శుభకార్యంలో పాల్గొనేందుకు జీనంవాండ్లపల్లికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి వెనుక ప్రహరీ దూకి ప్రాంగణంలోకి ప్రవేశించారు. తలుపు తాళం బద్ధలుగొట్టి లోపలకెళ్లి బీరువాలు ధ్వంసం చేసి అందులోని నగదు, బంగారం అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న యజమాని చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాయుడు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బైక్, లారీ ఢీ - ఇద్దరి దుర్మరణం

- మృతులు నల్లమాడ మండల వాసులు

బెంగళూరు: బెంగళూరు వైట్‌ఫీల్డ్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లమాడ మండలం చంద్రాయునిపల్లికి చెందిన బడా చంద్రశేఖర్‌రెడ్డి (43), మసకవంకపల్లికి చెందిన రవీంద్ర (55) బెంగళూరులోని గుంజూరులో నివాసముంటూ.. ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇద్దరూ బైకుపై వెళుతుండగా.. వైట్‌ఫీల్డ్ పరిధిలోని వర్తూరు కోడి సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. లారీని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు రఫీ

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్ర నగర్‌కు చెందిన అమీర్ కుమారుడు రఫీ (18) మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబసభ్యులకు చేదోడుగా ఉన్నాడు. శనివారం ఉదయం తండ్రి మందలించడంతో క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లిన కుటుంబసభ్యులు విషయాన్ని గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెనుకొండ.. జగనన్నే అండ!



పెనుకొండలో శరవేగంగా జరుగుతున్న మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు



పెనుకొండ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పర్యవేక్షిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్ (ఫైల్)

- పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అడుగులు
- వైద్యకళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు
- ముమ్మరంగా పనులు.. ఏడాదిలో పూర్తిచేసేలా ఆదేశాలు
- పెనుకొండ చరిత్ర తిరగరాస్తున్న సీఎం వైఎస్ జగన్

పెనుకొండ: విజయనగర రాజుల వైభవానికి ప్రతీగా నిలిచిన పెనుకొండ ఆ తర్వాత కాలంలో ఉనికి కోల్పోయింది. ముఖ్యంగా టీడీపీ హయాంలో పెనుకొండ కీర్తి మసకబారింది. కనీస రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. కనీస సౌకర్యాలకు నోచుకోక జనం అల్లాడిపోయారు. వైద్య సౌకర్యాలు లేక ప్రాణమ్మీదకు వచ్చిన వేళ బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి తదితర దూర ప్రాంతాలకు పరుగు తీసేవారు. అయితే వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే చారిత్రక నేపథ్యమున్న పెనుకొండ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. కోట పైకి రోడ్డువేయడంతో పాటు రోడ్లు, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ఏకంగా మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

రూ. 475 కోట్లతో పనులు ముమ్మరం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పెనుకొండకు మెడికల్ కళాశాల మంజూరైంది. అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి మార్గం సుగమమైంది. షీఫారం ప్రాంతంలో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించిన ప్రభుత్వం..ఏకంగా రూ.475 కోట్లు మంజూరు చేసింది. అలాగే ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన పరికరాలకు మరో రూ. 12 కోట్లు కేటాయించారు. ఈక్రమంలో 2021 మే 31న వర్చువల్‌గా పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో ప్రస్తుతం మెడికల్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెడికల్ కళాశాల మూడు అంతస్తుల్లో నిర్మిస్తుండగా...630 పడకలు అందుబాటులోకి రానున్నాయి. మెడికల్ కళాశాల ఏర్పాటవుతున్న స్థలం కొండ ప్రాంతం కావడంతో పనులు కాస్త ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ ఏడాదిలో మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి చేసి అడ్మిషన్లు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అదేవిధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు కూడా వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. మెడికల్ కళాశాల, ఆస్పత్రి... రెండూ అందుబాటులో వస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగనుంది.



కింది అంతస్తు పనులు చేపట్టిన దృశ్యం

వైద్య తరగతులు..పక్కనే వైద్య చికిత్సలు..

పెనుకొండలో నిర్మాణమవుతున్న మెడికల్ కళాశాలలో ఏటా వందమంది వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంది. నాలుగేళ్లు గడిచాక ఏటా 400 మంది వైద్య విద్యార్థులకు అవకాశం కలగనుంది. మొదటి సంవత్సరం 100, రెండో సంవత్సరం 200, మూడో సంవత్సరం 300, నాలుగో సంవత్సరం 400 మంది వైద్య విద్యార్థులు ఈ కళాశాల నుంచి బయటకు వస్తారు. విద్యార్థులు ఉండేందుకు కళాశాల ఆవరణలోనే నివాసాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా నర్సింగ్ విద్యార్థులు విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. ఇక రక్తనిధి కేంద్రం, పోస్టుమార్టం, ఇతర అత్యవసర చికిత్సలు ఇక్కడే నిర్వహిస్తారు. మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే కార్పొరేట్ వైద్యానికి తీసిపోకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

నాణ్యతలోపం లేకుండా పనులు..

మెడికల్ కళాశాల నిర్మాణపనులు దక్కించుకున్న 'మెగా' సంస్థ న్యూఢిల్లీకి చెందిన వాయింట్స్ డిజైన్ మేరకు పనులు కొనసాగిస్తోంది. పనులకు సంబంధించి నాణ్యతలోనూ ప్రభుత్వం ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకుంది. పనులను టాటా కన్సెల్టెంటీ, క్వాలిటీ కంట్రోల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నాణ్యత రిపోర్టులు వచ్చాకే నాబార్డు నేతృత్వంలోని పర్యవేక్షణ సంస్థ బిల్లులు మంజూరు చేస్తోంది.

పర్యవేక్షించిన మంత్రి ఉషశ్రీచరణ్..

ఇటీవల మంత్రి ఉషశ్రీ చరణ్ మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పర్యవేక్షించారు. అన్ని బ్లాకులను సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్లకు సూచించారు. ఏడాదిలోపు పనులు తప్పక పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



మాజీ సర్పంచ్ రవిచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న అపర్ణారెడ్డి

నల్లమాడ: వైఎస్సార్ సీపీ నేత, పులగంపల్లి మాజీ సర్పంచ్ కే.రవిచంద్రారెడ్డి శ్వాసకోశ సంబంధిత జబ్బుతో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం యర్రచెరువుపల్లిలోని నివాసగృహానికి చేరుకొని కోలుకొంటున్నాడు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి శనివారం రవిచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందంటూ ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని అపర్ణారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మండల పార్టీ పరిశీలకులు బీఆర్ కేశప్ప, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, మాజీ కో ఆప్షన్ సభ్యులు మాబూఖాన్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరయ్య, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 7 గంటల నుంచే పోలింగ్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ కొనసాగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, ఇతర సిబ్బంది ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయం వరకూ ఎన్నికను కొనసాగించాలన్నారు. సమయంలో విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

108 వాహనం బోల్తా

నల్లచెరువు: మారిశెట్టిపల్లి వద్ద 108 వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్త కమ్మవారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న రోగిని శనివారం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో మారిశెట్టిపల్లి వద్దకు రాగానే 108 వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోగితో పాటు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని మరొక 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లి, మునిమడుగు, వెంకటగిరిపాళ్యం, గోనిపేట, శెట్టిపల్లి, గుట్టూరు, నాగళూరు, మావటూరు, అడదాకులపల్లి, రాంపురం, దుద్దేబండ పంచాయతీ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకూ తిరుగుతు ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ ప్రభుత్వనికే పట్టం కట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సర్పంచులు నాగమూర్తి, అలివేలమ్మ, నాగరత్నమ్మ, లక్ష్మి, గౌతమి, అశ్వర్థనారాయణ, నాగరాజు, వైస్ ఎంపీపీలు చంద్రకళ, రామాంజినేయులు, నాయకులు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వెంకటరెడ్డి, దుర్గప్ప, మల్లిరెడ్డి, శ్యామునాయక్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌నాయక్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

రొద్దం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శనివారం పెద్దగువ్వలపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతీరెడ్డి, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, అంజినరెడ్డి, ఉప్పర గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతునికి ఎమ్మెల్యే నివాళి



చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: చంద్రాయనిపల్లికి చెందిన బడా చంద్రశేఖర్‌రెడ్డి(43) శుక్రవారం అర్ధరాత్రి బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట స్థానికులు ఉన్నారు.

దుద్దుకుంటకు జన నీరాజనం



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ



రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

- ముగిసిన ప్రచారం పర్వం
- నియోజకవర్గాన్ని చుట్టేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- రోడ్ షోలు, బహిరంగ సభలు, ఇంటింటా ప్రచార హోరు
- కుటుంబ సభ్యుల విస్తృత ప్రచారం

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి జనం నీరాజనాలు పట్టారు. ఆయన ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలిసి ఏ గ్రామానికి వెళ్లినా గజమాలలు, పూలవర్షం కురిపిస్తూ మహిళలు హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. దాదాపు నెల రోజులపాటు సాగిన ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుమారుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి, సోదరుడు శ్రీనివాసరెడ్డి, బావమరిది రాఘవరెడ్డి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యేతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభించింది. గ్రామగ్రామాన ప్రజలు పూలహారాలు, హారతులతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు మరోసారి జగన్ ముఖ్యమంత్రి అయితే ఏం చేస్తారో ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా టీడీపీ ప్రజలను ఎలా మభ్యపెడుతోంది, ఆ పార్టీ మేనిఫెస్టోలోని డొల్లతనాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాలు అందుకున్న జనం వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారానికి పూర్తి మద్దతు ప్రకటించారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని నాయకుల ఎదుటే ప్రకటించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా..

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జగన్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను సాధించానని, తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి అంకితమవుతానని ప్రకటించారు. ప్రధానంగా రూ.864 కోట్లతో నియోజకవర్గంలోని 193 చెరువులు నింపే పనులు మొదలుపెట్టామని, తనను గెలిపిస్తే అతి త్వరలో పనులు పూర్తి చేయిస్తానని చెప్పుకొచ్చారు. సీఎం జగన్ ఆశీస్సులతో నియోజకవర్గానికి 3 టీఎంసీలు కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే నియోజవర్గం మీదుగా మూడు రహదారులు వెళ్లేలా కృషి చేశానని, అవి పూర్తయితే భారీగా పరిశ్రమలు వచ్చే అవకాశముందని ప్రజలకు తెలియజేశారు.

ప్రచారానికి అనూహ్య స్పందన

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. గ్రామాల్లో సైతం రోడ్ షోలు నిర్వహించగా పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి మద్దతు ప్రకటించారు. ఇక మండల కేంద్రాల్లో ర్యాలీలు, రోడ్ షోలు, బహిరంగ సభలకు జనం పోటెత్తారు.



ప్రచారంలో అపర్ణారెడ్డికి హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు



ప్రచారంలో భాగంగా ఓటడుగుతున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటెయ్యండని అభ్యర్థిస్తున్న కిషన్‌రెడ్డి

సొంతగూటికి ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: చారుపల్లి ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తిరిగి సొంత (వైఎస్సార్ సీపీ) గూటికి చేరారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీటీసీగా గెలుపొందిన ఆయన కొద్ది రోజుల క్రితం టీడీపీ నేతలు మాయ మాటలు నమ్మి ఆపార్టీలో చేరారు. అయితే శనివారం స్వచ్ఛందంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు చాంద్‌బాషా పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



డ్రైనేజీ వద్ద బైకుపై వెళ్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని తాలూకా కార్యాలయం వెనుక బస్టాండుకు వెళ్లే రోడ్డులో మలుపులో డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ కాలువపై ఉన్న బండ తొలగిపోయి కొన్నేళ్లు కావస్తోంది. అయినా స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. ఆ మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకునే ప్రయత్నంలో అనేక మంది మహిళలు, వృద్ధులు, పాదచారులు డ్రైనేజీలో పడి గాయపడుతున్నారు. పెను ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి డ్రైనేజీపై సిమెంట్ కాంక్రీట్‌తో మూత వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

- రేపు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఓటు హక్కు వినియోగించుకోనున్న రూ.2.10 లక్షల మంది ఓటర్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న ఆర్‌ఓ అపూర్వభరత్



పెనుకొండలో కవాతులో పాల్గొన్న ఆర్‌ఓ అపూర్వ భరత్, పోలీసులు, జవాన్లు

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారం శనివారంతో ముగిసింది. గత నెల రోజులుగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అన్ని గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రచారం ముగిసి ఓటు వేయడానికి మరో రోజు మాత్రమే ఉండడంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల కాలంలో డీబీటీ ద్వారా నియోజకవర్గంలో 2.10 లక్షల మందికి రూ.2,520 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. అలాగే నియోకవర్గంలో రూ.1200 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గంలో 2,33,682 మంది ఓటర్లు ఉండగా అందులో 1,17,310 మంది పురుషులు, 1,16,369 మంది స్త్రీలు, ముగ్గురు థర్డ్ జెండర్ ఉన్నారు.

పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

నియోజకవర్గంలో ఈనెల 13 జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పెనుకొండ పట్టణంతో పాటు మండలం, సోమందేపల్లి, రొద్దం, పరిగి, గోరంట్ల మండలాల్లో ఉన్న 265 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కూడా ఇప్పటికే కల్పించారు.

బందోబస్త్‌పై ప్రత్యేక దృష్టి...

పెనుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేయాలని ప్రజలు, ఓటర్లు కోరుతున్నారు. నాలుగు రోజుల క్రితం పెనుకొండ పట్టణంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సందర్భంగా పోలీసులపై టీడీపీ శ్రేణులు ఘర్షణ వైఖరికి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌లకు దూరంగా నాయకులను ఉంచితే ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందకుండా ఓట్లు వేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎవరైనా ఎన్నికల నిబంధలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి పట్టణంలో పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, జవాన్లతో కలసి పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేంద్ర బలగాల కవాతు

కొత్తచెరువు: ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కొత్తచెరువు సీఐ రాజరమేష్ సూచించారు. శనివారం మండలంలోని తలమర్ల గ్రామంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసు బలగాల కవాతు

బత్తలపల్లి: ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శనివారం మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు, గంటాపురం, అప్పరాచెరువు, ఈదుల ముష్టూరు గ్రామాల్లో 20 కేరళ పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, స్టేషన్ సిబ్బంది, కేరళ పోలీసు బలగాలు పాల్గొన్నారు.



కొత్తచెరువులో కవాతు నిర్వహిస్తున్న బలగాలు



అప్పరాచెరువులో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించండి



కుటాలపల్లి రోడ్ షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కోరారు. నల్లమాడ పంచాయతీలోని కుటాలపల్లిలో శుక్రవారం రాత్రి ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతినెలా ఏఏ సంక్షేమ పథకం వర్తిస్తుందో ముందుగా ప్రకటించిన వాటికి సంబంధించిన లబ్ధిని డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకే అందించారన్నారు. జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. వంచనకు మారుపేరైన చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా మీ బిడ్డ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎంపీటీసీ శివారెడ్డి, చంద్రహాసరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, మాధవరెడ్డి, కేశవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు: కోటూరు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మైబున్ బీ(57) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువనేత ఎంజీ రెడ్డి శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి రూ. 20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేట వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు



మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం శుక్లపక్ష తృతీయను పురస్కరించుకుని మూలవిరాట్ వేంకటేశ్వరస్వామికి శ్రీమన్నారాయణ రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహామంగళ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగళి నైవేద్యాన్ని అందజేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత పేట వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ గౌరవాధ్యక్షులు భగీరథ నవీన్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న శంకర్‌నాయక్

పుట్టపర్తి టౌన్: గిరిజనులంతా సోమవారం జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రతిపక్షాలను తరిమి కొడదామని గిరిజనప్రజాసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు శంకర్‌నాయక్ పేర్కొన్నారు అన్నారు. శనివారం ఆయన 18 వార్డు బడేనాయక్ తండాలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఆపార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకొన్నట్టేనన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం గెలిచిన తరువాత విస్మరించడం గతంలో చూశామన్నారు. ప్రస్తుతం అమలయ్యే పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలిచి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి ఆదరించాలన్నారు. వార్డు కౌన్సిలర్ పరుశురాంనాయక్, నాయకులు మల్లికార్జుననాయక్, సోమ్లానాయక్, రాంజీనాయక్, రమేష్‌నాయక్, శంకర్, గోపాల్‌నాయక్, బాలకృష్ణనాయక్, ఓబులేసునాయక్, రాజునాయక్, హనుమంత్‌నాయక్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



గోరంట్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, జవాన్లు

గోరంట్ల: 'సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారంతా ఓటు హక్కును వినియోగించుకోండి. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు' అని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో గుమ్మయ్యగారిపల్లి క్రాస్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకూ స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. అలాగే సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రాజేష్ , ఇన్‌స్పెక్టర్లు బీకె ఘోష్, డీబీ మహత, రామరావు, విశ్వమిత్ర, పలనీ స్వామి, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్



'పురం'లో మూతపడిన ఓ మద్యం షాపు

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న పోలింగ్ జరుగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా మద్యం దుకాణాలను శనివారం సాయంత్రం మూసివేశారు. హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఉన్న దుకాణాలను 48 గంటల ముందే ఈసీ ఆదేశాలతో మూసివేశారు. తిరిగి మద్యం దుకాణాలను 14వ తేదీ తీయనున్నారు.

144 సెక్షన్ అమలు

నల్లమాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో శనివారం రాత్రి 6 గంటల నుంచి 14వ తేదీ ఉదయం 7 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. నలుగురు, అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమికూడరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.